చదువుల వనం..
కొలువులు ఘనం

- నిరుద్యోగులకు పెన్నిధి జిల్లా కేంద్ర గ్రంథాలయం
- అందుబాటులో వేల పుస్తకాలు
- ఇక్కడ చదువుకున్న వారిలో ఇటీవల ఇద్దరు కానిస్టేబుల్, ఇద్దరు డీఎస్సీకి ఎంపిక



పోటీ పరీక్షలకు చదువుతున్న అభ్యర్థులు

డాబాగార్డెన్స్: నిరుద్యోగులకు విజ్ఞానం అందిస్తోంది జిల్లా కేంద్ర గ్రంథాలయం. సుమారు 7 దశాబ్దాలుగా విద్యార్థులు, నిరుద్యోగులకు బాసటగా నిలుస్తోంది. ఆరేడు దశాబ్దాల కిందట కేజీహెచ్ అప్‌రోడ్డులో ఉండే జిల్లా కేంద్ర గ్రంథాలయాన్ని అనివార్య కారణాల వల్ల దశాబ్దం కిందట నగరంలోని జగదాంబ జంక్షన్‌కు కూతవేటు దూరంలో మెలోడీ థియేటర్ వద్ద ప్రైవేట్ భవనంలోకి మార్చారు. ఎందరికో విజ్ఞానాన్ని అందిస్తూ ప్రగతి పథంలో దూసుకుపోతోంది. ఇటీవల నిర్వహించిన పోలీస్ రిక్రూట్‌మెంట్, డీఎస్సీ (ఉపాధ్యాయ పోస్టులకు) పరీక్షల్లో నలుగురు విద్యార్థులు ఎంపికై పలువురికి ఆదర్శంగా నిలిచారు.

అన్ని వర్గాల వారికి అందుబాటులో..

ఈ గ్రంథాలయం అన్ని వర్గాలకు అందుబాటులో ఉంది. విద్యార్థులు, నిరుద్యోగులు, చిన్నారులు, సాహితీప్రియులు, వృద్ధులు ఇలా అందర్నీ అలరిస్తూ విజ్ఞానాన్ని, వినోదాన్ని అందిస్తూనే ఉంది. పోటీ పరీక్షలకు వెళ్లే నిరుద్యోగులకు ఎంతో ఉపయోగంగా ఉంది. వీరి కోసం ప్రత్యేకంగా ఓ గది కేటాయించారు. పుస్తకాలు చదువుకునేందుకు ప్రత్యేకంగా టేబుళ్లు, కుర్చీలు ఏర్పాటు చేశారు. రోజుకు సుమారుగా 150 నుంచి 200 మంది ఈ గ్రంథాలయానికి వస్తుంటారు.

పాఠకులపై ప్రభావం చూపని డిజిటల్ యుగం..

సెల్‌ఫోన్ యుగం వచ్చిన తర్వాత ప్రపంచం ముంగిట నిలుస్తోంది. అయితే డిజిటల్ గ్రంథాలయాలు కూడా ఆన్‌లైన్‌లో ఉండడంతో ఈ ప్రభావం గ్రంథాలయాలపై పడుతుందేమోనని చాలా మంది పుస్తక ప్రియులు ఆందోళన చెందారు. కానీ ఆ ప్రభావం గ్రంథాలయాలపై లేదని గ్రంథాలయాధికారి చెబుతున్నారు. పాఠకులు, పుస్తకప్రియుల సంఖ్య తగ్గడం లేదని తెలిపారు.

పాఠకులను ఆకట్టుకునేందుకు..

పాఠకులను ఆకట్టుకునేందుకు గ్రంథాలయాల ఆవశ్యకతను తెలియజెప్పేందుకు పలు కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నారు. ఇందులో భాగంగా వేసవి సెలవుల్లో విద్యార్థులకు శిక్షణ శిబిరాలు నిర్వహించారు. పలు అంశాల్లో పోటీలు నిర్వహిస్తున్నారు. పలు సంస్థలు, రీసోర్స్ పర్సన్ల ద్వారా విద్యార్థులకు పలు అంశాలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. సాహితీ కార్యక్రమాలు, కవి సమ్మేళనాలు నిర్వహిస్తున్నారు.

నిరుద్యోగులు, విద్యార్థులకు తొలి ప్రాధాన్యం..

నిరుద్యోగులు, విద్యార్థులకు తొలి ప్రాధాన్యతనిస్తున్నామని గ్రంథాలయ అధికారి తెలిపారు. వీరికి ఏ రకమైన పోటీ పరీక్షల పుస్తకాలు అవసరమో గమనించి వాటిని కొనుగోలు చేస్తున్నారు. అలాగే వీరికి ఏ పుస్తకం కావాలో వెంటనే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి త్వరితగతిన అందుబాటులో తీసుకొస్తున్నారు.



కేంద్ర గ్రంథాలయంలో విద్యార్థులు

ఈ గ్రంథాలయానికి ప్రత్యేక స్థానముంది..



జిల్లా కేంద్ర గ్రంథాలయానికి ప్రత్యేక స్థానముంది. ఇక్కడికి వచ్చే వారికి ప్రశాంతమైన వాతావరణం కల్పిస్తున్నాం. ఇక్కడ చదువుకుని పలువురు విద్యార్థులు ఉద్యోగాలు పొందారు. చాలా మంది డీఎస్సీలో ఉత్తీర్ణులయ్యారు. ఆర్ఆర్‌బీ, పోలీస్, ఏపీపీఎస్సీ పోటీ పరీక్షల్లో పాల్గొని ర్యాంకులు సాధించి ఉద్యోగాలు దక్కించుకున్నారు. ప్రతిరోజూ ఉదయం 8 నుంచి రాత్రి 7 గంటల వరకు గ్రంథాలయానికి వచ్చి ప్రిపేరయ్యేవారు. జిల్లా వ్యాప్తంగా గ్రంథాలయాల్లో పోటీ పరీక్షలకు ప్రిపేరయ్యే వారిలో 55 మంది పోలీస్, ఉపాధ్యాయులుగా ఎంపిక కావడం సంతోషకరం.

– బుర్రి కుమార్‌రాజు,
ఉమ్మడి విశాఖ జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి

స్కూల్ అసిస్టెంట్‌కి ఎంపికయ్యా..



ఐదేళ్ల నుంచి డీఎస్సీ, పోటీ పరీక్షల కోసం ప్రిపేరవుతున్నా. ఈ గ్రంథాలయానికి ప్రతిరోజూ ఆరిలోవ నుంచి వస్తున్నా. ఇక్కడ పోటీ పరీక్షలకు సంబంధించిన మెటీరియల్ అనుకూలంగా ఉంది. ఉపాధ్యాయ పోస్టులకు సంబంధించి ఇటీవల నిర్వహించిన డీఎస్సీలో స్కూల్ అసిస్టెంట్‌కి ఎంపికయ్యాను.

–ఎస్‌కే లక్ష్మి, ఆరిలోవ, డీఎస్సీలో స్కూల్ అసిస్టెంట్ పోస్ట్‌కి ఎంపికైన అభ్యర్థి

సివిల్ కానిస్టేబుల్‌కి ఎంపికయ్యా..



2021 నుంచి కానిస్టేబుల్ పోస్ట్ కోసం ప్రిపేరవుతున్నా. కానిస్టేబుల్‌తో పాటు ఆర్పీఎఫ్, పోటీ పరీక్షలకు ప్రిపేరవుతున్నా. ఇక్కడ మంచి మెటీరియల్ ఉంది. చదివిన కష్టానికి ఫలితం దక్కింది. సివిల్ కానిస్టేబుల్ పోస్ట్‌కి ఎంపికయ్యాను. సహకరించిన జిల్లా కేంద్ర గ్రంథాలయానికి కృతజ్ఞతలు.

–పేర్ల లలిత, సివిల్ కానిస్టేబుల్ పోస్ట్‌కి ఎంపికైన అభ్యర్థి

పోలీస్ అయ్యాను..



కానిస్టేబుల్ పోస్ట్‌కి ఎంపికయ్యాను. నాలుగేళ్లుగా జిల్లా కేంద్ర గ్రంథాలయంలోనే ప్రిపేరయ్యాను. పోతినమల్లయ్యపాలెం నుంచి ఇక్కడికి వచ్చి చదువుకున్నాను. పోటీ పరీక్షలు రాసే వారికి కావలసిన అన్ని రకాల పుస్తకాలు ఇక్కడ లభ్యమవుతున్నాయి. –పల్లా స్వాతి, పోతినమల్లయ్యపాలెం

క్లుప్తంగా

కనకమహాలక్ష్మికి అష్టదళ పద్మారాధన



అష్టదళ పద్మారాధనలో సిరులతల్లి

డాబాగార్డెన్స్: బురుజుపేటలో వెలసిన కనక మహాలక్ష్మి అమ్మవారి దేవస్థానంలో మంగళవారం 108 స్వర్ణపుష్పాలతో అష్టదళ పద్మారాధన నిర్వహించారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు నిర్వహించిన ఈ పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆలయ ఈవో కె. శోభారాణి, ఏఈవో రాజేంద్రకుమార్, వేదపండితులు, అర్చకులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా దుర్గమ్మ ఆలయ వార్షికోత్సవం

డాబాగార్డెన్స్: జీవీఎంసీ ప్రధాన కార్యాలయ ప్రాంగణంలో వేంచేసిన దుర్గమ్మ ఆలయ వార్షికోత్సవం మంగళవారం జీవీఎంసీ ఉద్యోగులు ఘనంగా నిర్వహించారు. అమ్మవారికి విశేష పూజలు జరిపారు. వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని బాణసంచా కాల్చారు. సాముగరిడీ, డప్పు వాయిద్యాలు తదితర సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. జీవీఎంసీ ఆలయ కమిటీ సభ్యులు ఒమ్మి సురేష్, జగన్, రాజేష్, ప్రకాష్, భాస్కర్, అప్పలరాజు, వాసు, రాజ్ గణేష్, ప్రశాంతితో పాటు పలువురు ఉద్యోగులు పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు.

వర్క్‌షాప్‌లతో మెరుగైన నైపుణ్యం



విద్యార్థినులకు మెలకువలు నేర్పుతున్న రీసోర్స్ పర్సన్ డాక్టర్ ప్రకాష్

డాబాగార్డెన్స్: విశాఖ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల గోల్డెన్ జూబ్లీ సెలబ్రేషన్స్‌ను పురస్కరించుకుని మంగళవారం కళాశాల బోటనీ విభాగం ఆధ్వర్యంలో వర్క్‌షాప్ నిర్వహించారు. టెక్నిక్స్ ఇన్ ప్రాపగేషన్ ఆఫ్ మెడిసినల్ అండ్ ఆర్నమెంటల్ ప్లాంట్ అనే అంశంపై నిర్వహించిన వర్క్‌షాప్‌లో రీసోర్స్ పర్సన్, ఏయూ క్యూరేటర్ డాక్టర్ జె.ప్రకాష్ పాల్గొని కళాశాల విద్యార్థినులకు గ్రాఫ్టింగ్, లేయరింగ్ తదితర ప్రాపగేషన్ టెక్నిక్స్ చెప్పి, విద్యార్థినులతో వాటిని చేయించారు. విద్యార్థినులు వర్క్‌షాప్‌లలో పాల్గొని వారి నైపుణ్యాలు మెరుగుపరచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కళాశాల వృక్షశాస్త్ర విభాగాధిపతి డాక్టర్ టీఎంఏ నివేదిత, అధ్యాపకురాలు డాక్టర్ జె.లావణ్య, గెస్ట్ ఫ్యాకల్టీ అంజలి, మహాలక్ష్మి, బోటనీ విద్యార్థినులు తదితరులు పాల్గొన్నారు.

మోసాలకు పాల్పడుతున్న ఇద్దరి అరెస్టు

డాబాగార్డెన్స్: పలు మోసాలకు పాల్పడుతున్న ఇద్దరు వ్యక్తులను వన్‌టౌన్ పోలీసులు మంగళవారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. వివరాల్లోకి వెళ్తే.. పాతనగరం వన్‌టౌన్ ప్రాంతానికి చెందిన నవీన్‌కుమార్ దంపతులను మోసగించి.. బంగారంతోపాటు ఇతర ఆస్తులను ఇజ్జాడ దామోదర నాయుడు, ఇజ్జాడ ఉమామహేశ్వరరావు తీసుకున్నారు. కొన్నాళ్ల తరువాత బాధితులు అడిగితే నచ్చినవాళ్లకు చెప్పుకోండి అంటూ బెదిరింపులకు పాల్పడ్డారు. ఈ విషయమై బాధితులు వన్‌టౌన్ పోలీసులను ఆశ్రయించారు. మోసానికి పాల్పడ్డ ఇజ్జాడ దామోదర నాయుడు, ఇజ్జాడ ఉమామహేశ్వరరావును వన్‌టౌన్ సీఐ జీడీ బాబు అరెస్టు చేసి రిమాండ్‌కు పంపారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ ఎవరైనా బాధితులుంటే వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయవచ్చన్నారు.

దసరా ఉత్సవాల పోస్టర్ ఆవిష్కరణ



ఉత్సవాల పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ తదితరులు

డాబాగార్డెన్స్: వెలంపేటలో వేంచేసిన దుర్గాలమ్మ ఆలయంలో ఈ నెల 22 నుంచి అక్టోబర్ 2 వరకు నిర్వహించనున్న దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల పోస్టర్‌ను మంగళవారం ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ శివాజీపాలెంలో ఉన్న తన క్యాంపు కార్యాలయంలో ఆవిష్కరించారు. ఉత్సవాలు వచ్చే నెల 2వ తేదీ వరకు అత్యంత వైభవంగా నిర్వహించనున్నామని ఆలయ ఈవో శేఖర్‌బాబు తెలిపారు. నవరాత్రి ఉత్సవాల్లో ప్రతి రోజూ అమ్మవారు వివిధ రూపాల్లో భక్తులకు దర్శనమివ్వనున్నారని ఎమ్మెల్యేకి తెలిపారు. కార్యక్రమంలో ఆలయ సిబ్బంది, స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

అదానీ సంస్థకు భూకేటాయింపులు రద్దు చేయాలి



మాట్లాడుతున్న సీపీఎం విశాఖ జిల్లా కార్యదర్శి జగ్గునాయుడు

డాబాగార్డెన్స్: పెదగంట్యాడలో అదానీ గంగవరం గ్రేడింగ్ సిమెంట్ యూనిట్‌కు భూకేటాయింపులు, అనుమతులు రద్దు చేయాలని, జనావాసాలకు దూరంగా పరిశ్రమలు ఏర్పాటు చేయాలని సీపీఎం విశాఖ జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు డిమాండ్ చేశారు. సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఆర్‌కేఎస్‌వీ కుమార్, వి.కృష్ణారావుతో కలిసి సిటు జిల్లా కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. విశాఖ జిల్లా పెదగంట్యాడ మండలం సర్వే నంబరు 97(పి), 98(పి), 99(పి), 101(పి)లో సుమారు 20 ఎకరాల భూమిని అదానీ అంబుజా సిమెంట్స్‌కు గంగవరం సిమెంట్ గ్రైడింగ్ యూనిట్ ఏర్పాటుకు కట్టబెట్టడానికి కూటమి ప్రభుత్వం సిద్ధపడుతోందన్నారు. అందుకు సంబంధించి వచ్చే నెల 8న ప్రజాభిప్రాయ సేకరణ చేపడుతున్నట్టు ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి ప్రకటన విడుదల చేసిందన్నారు. సాగరతీరం, స్టీల్‌ప్లాంట్, జనావాసాలకు మధ్య ఈ పరిశ్రమ ఏర్పాటు వల్ల పెదగంట్యాడ, గాజువాక, గంగవరం, మల్కాపురం పరిసర ప్రాంతాల్లో నివాసముంటున్న సుమారు 12 లక్షల మంది ప్రజల ఆరోగ్యాలకు, జీవరాశులకు హానీ జరుగుతుందని చెప్పారు. ఈ పరిశ్రమ వల్ల గాలి, నీరు, భూగర్భ జలాలు కలుషితమవుతాయని, శబ్ద కాలుష్యం పెరుగుతుందన్నారు. భారీ వాహన రాకపోకలు పెరిగి ప్రమాదాలు జరిగే అవకాశం ఉందన్నారు. ప్రాణ నష్టం అధికమవుతుందని చెప్పారు. కేవలం 60 పర్మనెంట్, 200 మందికి కాంట్రాక్ట్ ఉపాధి మాత్రమే లభిస్తుందని, అది కూడా స్థానికులకు ఇస్తారన్న గ్యారంటీ లేదన్నారు.

కూటమి మోసాలపై ఇంటింటి ప్రచారం



నీలాపువారివీధిలో ప్రచారం చేస్తున్న రమేష్ తదితరులు

అల్లిపురం: జీవీఎంసీ 33వ వార్డులో ఆ వార్డు అధ్యక్షుడు ముత్తాబత్తుల రమేష్ ఆధ్వర్యంలో మంగళవారం బాబు ష్యూరిటీ.. మోసం గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. 59వ బూత్ పరిధి నీలాపువారి వీధిలో జరిగిన కార్యక్రమంలో గడప గడపకు వెళ్లి బాబు ఇచ్చిన మోసపూరిత హామీల గురించి నాయకులు ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు పచ్చిరపల్లి రాము, పీవీఎస్ రెడ్డి, కృష్ణారెడ్డి, బాల నారాయణరెడ్డి, సౌత్ కల్చరల్ వింగ్ అధ్యక్షుడు సూర్య నాయుడు, సిద్ధేశ్వరరావు, ధర్మారావు, రమణమ్మ, సత్య, అనంతలక్ష్మి, శ్రావణి, అఖి, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

కార్పొరేటర్ పూర్ణిమ దాతృత్వం

షుగర్ వ్యాధిగ్రస్తుడికి పాదాలు తొలగించడంతో ప్రత్యేక పాదరక్షలు, రూ. 5 వేల నగదు అందజేసిన వైనం



ఎర్రయ్యకు నగదు అందజేస్తున్న 41వ వార్డు కార్పొరేటర్ పూర్ణిమ, శ్రీధర్

కంచరపాలెం: జ్ఞానాపురం పరిధి బాబూకాలనీలో నివాసం ఉంటున్న పూతి ఎర్రయ్య గత కొద్ది నెలలుగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. మంగళవారం వార్డ్ పర్యటనలో భాగంగా 41వ వార్డు కార్పొరేటర్ కోడిగుడ్ల పూర్ణిమ ఎర్రయ్య నివాసానికి వెళ్లి పరామర్శించారు. ఆరోగ్యం పట్ల జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. అన్ని విధాలా ఆదుకుంటామని భరోసా ఇచ్చారు. అనంతరం వైఎస్సార్‌సీపీ వార్డు అధ్యక్షుడు కోడిగుడ్ల శ్రీధర్ సమక్షంలో వైద్య ఖర్చులకు రూ.5 వేల నగదు, నిత్యావసర సరుకులు అందజేశారు. షుగర్ వ్యాధి వల్ల ఎర్రయ్య పాదాలు తొలగించడం వల్ల నడవలేక పోతుండడంతో ప్రత్యేకంగా చేయించిన చెప్పులు అందించి కార్పొరేటర్ పూర్ణిమ దాతృత్వం చాటుకున్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, వేళంగిణీరావు, పాత్రపల్లి సునీల్‌కుమార్, కిషోర్, పరశురామ్, రాజు, మధు, ఈశ్వరి, దేవి, అన్నపూర్ణ, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

సెయింట్ జోసెఫ్‌లో హిందీ దివస్



హిందీ పత్రికను ఆవిష్కరిస్తున్న అతిథులు, విద్యార్థులు

కంచరపాలెం: జ్ఞానాపురం సెయింట్ జోసెఫ్ మహిళా కళాశాలలో హిందీ విభాగాధిపతి డాక్టర్ పి.కె.జయలక్ష్మి నేతృత్వంలో మంగళవారం హిందీ వారోత్సవాలు నిర్వహించారు. నెహ్రూ యువ కేంద్రం డిప్యూటీ డైరెక్టర్ మహేశ్వరరావు, కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సిస్టర్ షైజీ జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా డిప్యూటీ డైరెక్టర్ మహేశ్వరరావు మాట్లాడుతూ రాజ్యభాష హిందీ ప్రాముఖ్యతను తెలిపారు. హిందీ సాహిత్య భారతి, విశాఖ యూనిట్ నెహ్రూ యువకేంద్రం, భారత ప్రభుత్వం సంయుక్తంగా నిర్వహించిన ఈ కార్యక్రమంలో విద్యార్థులకు వాద వివాదం, వ్యాస రచన, కవితా పఠనం, ప్రశ్నోత్తర పోటీలు, సాహిత్య, సాంస్కృతిక పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. విద్యార్థులు ప్రదర్శించిన పలు నృత్యరూపకాలు ఆకట్టుకున్నాయి. అనంతరం హిందీ పత్రిక 19వ సంచికను అతిథులు ఆవిష్కరించారు. కార్యక్రమంలో డాక్టర్ ఎస్. దీప్తి, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

గురుకులం విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న గురుకులం ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు

ఆరిలోవ : రాష్ట్ర స్థాయి సబ్ జూనియర్ హ్యాండ్‌బాల్ టోర్నమెంట్‌లో శ్రీకృష్ణాపురం గురుకులం విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచారు. అండర్ –12 విభాగంలో ద్వితీయ స్థానంలో నిలిచి సిల్వర్ మెడల్ పొందారు. ఈ నెల 13, 14న కర్నూలులో జరిగిన టోర్నమెంట్‌లో ప్రతిభ కనబరిచి సోమవారం గురుకులానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా విజేతలను ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు మంగళవారం అభినందించారు. వారిలో ఇక్కడ ఏడో తరగతి చదువుతున్న రేవంత్ జాతీయ స్థాయి హ్యాండ్‌బాల్ టోర్నమెంట్‌కు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ రత్నవల్లి తెలిపారు. కార్యక్రమంలో పీడీ సాగర్ తదితరులు పాల్గొన్నారు.

అదనపు బస్సుల పెంపునకు చర్యలు చేపట్టాలి

డాబాగార్డెన్స్: విశాఖ జిల్లాలో ప్రయాణికులకు తగ్గట్టుగా రాష్ట్ర ప్రభుత్వం ఆర్టీసీ బస్సుల సంఖ్య పెంచి, ప్రజల కష్టాలు తీర్చాలని సీపీఎం విశాఖ జిల్లా కార్యదర్శి మరడాన జగ్గునాయుడు డిమాండ్ చేశారు. నగరంలోని జగదాంబ జంక్షన్ సమీపాన ఉన్న సీపీఎం కార్యాలయంలో మంగళవారం పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు వి.కృష్ణారావు, ఆర్‌కేఎస్‌వీ కుమార్‌తో కలిసి మీడియా సమావేశంలో మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం స్త్రీ శక్తి పథకం పేరిట మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించిందని, దీనిని సీపీఎం స్వాగతిస్తోందన్నారు. అయితే ప్రస్తుత బస్సులతోనే ఈ పథకం అమలు చేయడం వల్ల ప్రయాణికులు, ముఖ్యంగా సీనియర్ సిటిజన్లు, వికలాంగులు, పిల్లలు, విద్యార్థులు, పురుషులు తీవ్ర ఇబ్బందులు పడతున్నారన్నారు. గంటల తరబడి నిలబడి ప్రయాణించాల్సి వస్తుందని, ఆరోగ్యాలు దెబ్బతింటున్నాయన్నారు. కొన్ని సందర్భాల్లో బస్సుల్లో నిల్చోవడానికి కూడా ఖాళీ లేని పరిస్థితి, బస్సుల డోర్ల వద్ద విద్యార్థులు, యువత పిట్టల్లా వేలాడుతూ, ప్రయాణించాల్సిన దుస్థితి నెలకొందన్నారు. బస్సులు ఆపకపోతే ప్రయాణికులు డ్రైవర్లపై దాడులు చేస్తున్నారని, దుర్భాషలాడుతున్నారని, లోడ్ ఎక్కువగా ఉండడం వల్ల ఇటీవల ఓ బస్సు దగ్ధమైందన్నారు. బస్సుల్లో ఘర్షణలు కూడా చోటు చేసుకుంటున్నాయని తెలిపారు. జిల్లాలో ప్రస్తుతం 630 బస్సులు మాత్రమే నడుస్తున్నాయని, నిపుణుల అంచనా ప్రకారం పెద్ద నగరాల్లో ప్రతి లక్ష జనాభాకు కనీసం 60 బస్సులుండాలని, ఆ విధంగా మహా విశాఖ నగరానికి కనీసం 1500 బస్సులుండాలని తెలిపారు. జిల్లా మొత్తం కనీసం 2100 బస్సులుండాలని, కానీ 630 మాత్రమే ఉన్నాయన్నారు. బస్సుల సంఖ్య పెంచి రద్దీని నియంత్రించాల్సిన ప్రభుత్వం ప్రయాణికుల సమయాలు మార్చుకోవాలని ఆర్టీసీ ప్రాంతీయ మేనేజర్ ద్వారా ప్రకటన చేయించిందన్నారు. ఇది అత్యంత బాధ్యతా రాహిత్య ప్రకటన అని, ప్రజలు తమ అవసర సమయాల్లో ప్రయాణాలు చేస్తారని, బస్సుల రద్దీ సమయాలను బట్టి చేయాలనడం సరి కాదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఆర్టీసీ బస్సుల సంఖ్య పెంచే చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.

పారిశుధ్య పనుల నిర్వహణలో అలసత్వం తగదు

జీవీఎంసీ కమిషనర్ కేతన్‌గార్గ్



జోనల్ కమిషనర్లు, అధికారులకు ఆదేశాలిస్తున్న కమిషనర్ కేతన్‌గార్గ్

డాబాగార్డెన్స్: పారిశుధ్య పనుల నిర్వహణలో అలసత్వం వహించరాదని, నిర్ణీత సమయానికే అధికారులు, సిబ్బంది, పారిశుధ్య కార్మికులు విధులకు హాజరు కావాలని, వార్డు శానిటేషన్ కార్యదర్శులు అప్రమత్తతతో విధులు నిర్వహించేలా చర్యలు చేపట్టాలని జీవీఎంసీ కమిషనర్ కేతన్‌గార్గ్ ఆదేశించారు. క్షేత్రస్థాయి పర్యటనలో భాగంగా మంగళవారం జోన్-3, జోన్-5లోని పలు వార్డులు, నరసింహనగర్ రైతు బజార్ ప్రాంతాల్లో పర్యటించారు. పరిసర ప్రాంతాల్లో పారిశుధ్య పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ఎక్కడా వ్యర్థాలు లేకుండా చూడాలని ఆదేశించారు. పారిశుధ్య కార్మికులు, వార్డు సచివాలయ శానిటరీ కార్యదర్శుల హాజరును పరిశీలించారు. పారిశుధ్య కార్మికులు సచివాలయం పరిధిలో ఎక్కడెక్కడ విధులు నిర్వహిస్తున్నారో శానిటరీ కార్యదర్శులకు అవగాహన కలిగి ఉండాలన్నారు. అందుకు సచివాలయం డిస్ప్లేస్‌మెంట్ ప్లాన్, క్లాప్ వాహనాల రూట్ మ్యాప్, యాక్షన్ ప్లాన్ సిద్ధంగా ఉంచుకోవాలని ఆదేశించారు. దీర్ఘ కాలంగా విధులకు దూరంగా ఉన్న పారిశుధ్య కార్మికుల వివరాల జాబితా సిద్ధం చేసి, అందుకు ప్రత్యామ్నాయంగా తదుపరి చర్యలు చేపట్టాలని జోనల్ కమిషనర్లు కె.శివప్రసాద్, బి.రాముకు ఆదేశించారు. నరసింహనగర్ రైతు బజార్ వద్ద జనసంచారం అధికంగా ఉన్నందున అదే స్థాయిలో పరిసర ప్రాంతాల్లో కూడా వ్యర్థాలు ఎక్కువగా ఉంటాయని, ఉదయం, సాయంత్రం రెండు పూటలా వ్యర్థాలు తరలించేలా నిత్యం చర్యలు చేపట్టాలని ప్రధాన వైద్యాధికారి నరేష్‌కుమార్‌ను ఆదేశించారు. క్లాప్ వాహనాల నిర్వహణ కాంట్రాక్టర్‌తో మాట్లాడుతూ వాహనాల రాకపోకల్లో ఇబ్బందులు లేకుండా, డ్రైవర్లు సమయానికి వ్యర్థాలు సేకరించేలా అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. పర్యటనలో శానిటరీ సూపర్‌వైజర్ జనార్దన్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ క్రాంతి, వార్డు సచివాలయ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

జ్ఞానాన్వేషణతో ముందుకు సాగాలి

మద్దిలపాలెం : నిరంతరం జ్ఞానాన్వేషణతో యువతరం ముందుకు సాగాలని ఏయూ రెక్టార్ ఆచార్య ఎస్.కిషోర్ బాబు సూచించారు. ఏయూ సివిల్ ఇంజినీరింగ్ విభాగం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రెండు రోజుల సాంకేతిక సమ్మేళనం యాక్సెస్ 2కె 25 ముగింపు సమావేశం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శాస్త్ర ప్రగతి, నూతన ఆవిష్కరణలు తెలుసుకోవడానికి, నిపుణుల సూచనలు పొందడానికి ఇటువంటి సదస్సులు ఎంతో ఉపయుక్తంగా నిలుస్తాయన్నారు. అనంతరం వివిధ పోటీల విజేతలకు బహుమతులు అందించారు. ఐఐటీ కాన్పూర్ విశ్రాంత ఆచార్యులు ఎం.ఆర్.మాధవ్, రాకీరా ఇంజినీరింగ్ ప్రైవేట్ లిమిటెడ్ వైస్ ప్రెసిడెంట్ కేఎస్ఆర్ ప్రసాద్, స్టైస్టా సిస్టమ్స్ గ్లోబల్ టెక్నాలజీ ప్రైవేట్ లిమిటెడ్ సీఈవో బి.వి.నాగరాజ్ కుమార్, ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ వాల్యూవర్స్ విశాఖపట్నం కేంద్రం చైర్మన్ డేవిడ్ మక్వన్ మాట్లాడారు. విద్యార్థులు ఉత్సాహంగా తమ పరిశోధన పత్రాలను సమర్పించారు. ఆచార్య పి.వి.వి.సత్యనారాయణ, ప్రొఫెసర్ కె.శ్రీనివాసరావు, ఆచార్య ఎస్.యజ్ఞని, ఆచార్య టి.వి.ప్రవీణ్, ఆచార్య కె.శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు

విద్యార్థినులకు కెరీర్ గైడెన్స్‌పై కౌన్సెలింగ్



కెరీర్ గైడెన్స్ కౌన్సెలింగ్‌కు హాజరైన అధ్యాపకులు, విద్యార్థినులు

డాబాగార్డెన్స్: విశాఖ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల విద్యార్థినులకు మంగళవారం కెరీర్ గైడెన్స్‌పై కౌన్సెలింగ్ నిర్వహించారు. కళాశాల కెరీయర్ గైడెన్స్ సెల్, జేకేసీ, ఐక్యూఏసీ సంయుక్తంగా డిగ్రీ ఫైనలియర్ విద్యార్థులకు నిర్వహించిన వర్క్‌షాప్‌లో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్.మంజుల పాల్గొని మాట్లాడారు. డిగ్రీ పూర్తి చేసిన విద్యార్థులకు పోటీ ప్రపంచంలో కెరీయర్ గైడెన్స్ అండ్ కౌన్సెలింగ్ ఎంతో ఉపయోగపడుతుందన్నారు. నిర్మాణ్ ఆర్గనైజేషన్ కో ఆర్డినేటర్ కె.దినేష్‌కుమార్ డిగ్రీ అర్హతతో ప్రభుత్వ, ప్రైవేట్ రంగాల్లో ఉన్న ఉపాధి అవకాశాలు, నైపుణ్యం పెంచుకునే మార్గాల గురించి, ఉద్యోగ నియామకానికి నిర్వహించే ఇంటర్వ్యూలో ప్రభావంతమైన రెజ్యూంను సిద్ధం చేసుకోవడం, ఇంటర్వ్యూను సమర్థవంతంగా ఎదుర్కొనే మార్గాల గురించి వివరించారు. అలాగే ఉచితంగా జాబ్ స్కిల్, ట్రైనింగ్ వంటి అంశాలపై విద్యార్థినులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ వై.లక్ష్మి, కెరీయర్ గైడెన్స్ సెల్ బృందం, ఐక్యూఏసీ కో ఆర్డినేటర్ బి.సంతోషి అనూష, జేకేసీ కో ఆర్డినేటర్ విద్యాకల్పన, మెంటార్లు రాజు, ప్రజ్ఞ, అధ్యాపక బృందం, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

నిర్లక్ష్యం తగదు..



వన్‌టౌన్‌లో న్యూమార్కెట్ వద్ద గల జీవీఎంసీ హైస్కూల్‌లో టాంక్ లీకై ఫ్లోర్ తడిచిపోయింది. విద్యార్థులు అక్కడే ఆడుకుంటూ జారితే దెబ్బలు తగిలే అవకాశం ఉంది. ఇటువంటి ప్రమాదాలు జరగకుండా సిబ్బంది చర్యలు తీసుకోవాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.

– ఫొటో : సాక్షి ఫొటోగ్రాఫర్, విశాఖపట్నం